సాక్షి
వికారాబాద్
సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



సుడి దోమతో జాగ్రత్త

వరి పంటకు పొట్ట దశలో సుడిదోమ ఆశించి మొక్కలను పసుపురంగుకు మార్చి ఎండిపోయేలా చేస్తాయి. 10లో▸



నమో యువ రన్

తాండూరు పట్టణంలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ఆదివారం నమో యువరన్ కార్యక్రమం నిర్వహించారు. 10లో▸



ఆలయాలు ముస్తాబు

రేణుక ఎల్లమ్మ ఆలయంలో సోమవారం నుంచి నవరాత్రి ఉత్సవాలుంటాయని ఈఓ రాజేందర్‌రెడ్డి చెప్పారు. 11లో▸

న్యూస్‌రీల్

జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా కన్వీనర్ రాజ్‌కుమార్

మోమిన్‌పేట: రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో పాల్గొనాలని జిల్లా కన్వీనర్లు రాజ్‌కుమార్, వాజయ్ శ్రవణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులన్నారు. రాష్ట్ర కమిటీ ఎంపిక చేసిన బమ్మెర పోతన, దాశరథి కృష్ణమాచార్య, సుద్దాల హనుమంతు, వట్టికోట అళ్వార్‌స్వామి, వానమామలై వరదాచార్యులు, సురవరం ప్రతాప్‌రెడ్డి, సామల సదాశివ, బోయ జంగయ్య, పాకాల యశోద, కాళోజీ నారాయణరావు, డాక్టర్ సి.నారాయణరెడ్డి కవుల గురించి వ్యాసం రాయాల్సి ఉంటుందని చెప్పారు. పాఠశాల స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించి ఉత్తమంగా రాసిన ఒక బాలిక, ఒక బాలుడి వ్యాసాలను జిల్లా స్థాయికి పంపాలన్నారు. జిల్లా స్థాయికి వచ్చిన 50 వ్యాసాల నుంచి ఐదుగురిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయాలన్నారు. అక్టోబర్ 6వ తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులు అందరూ ఈ పోటీల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. ఇతర వివరాలకు 98667 50134, 84668 23975 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆలయాభివృద్ధికి సీఎం సహకారం

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

దుద్యాల్: మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో స్వయంభుగా వెలిసిన రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య అన్నారు. ఆదివారం ఆయన రూ.75 లక్షలతో ఆలయ ప్రాంగణం చుట్టూ నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. కడా ప్రత్యేక నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. పల్లెలు, పట్టణాలతో పాటు ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కొడంగల్ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి సైతం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జయరాములు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి

అనంతగిరి: తాగిన మత్తులో పలువురు యువకులు బస్సు డ్రైవర్‌పై దాడి చేశారు. ఈ ఘటన వికారాబాద్ సమీపంలోని అనంతగిరిగుట్టలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం.. తాండూరు నుంచి వికారాబాద్ ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సుకు అనంతగిరి ఆలయం సమీపంలో కొందరు యువకులు కారు అడ్డుపెట్టారు. అంతటితో ఆగకుండా డ్రైవర్ సత్తయ్యను దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నారు. ఎంత సముదాయించినా పట్టించుకోకుండా యువకులు హల్చల్ చేశారు. దీంతో ప్రయాణికులు వీడియో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. డ్రైవర్ సత్తయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి యువకులను అదుపులోకి తీసుకున్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి: ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన 1వ దక్షిణ భారత కరాటే చాంపియన్‌షిప్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ విభాగాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ నాయకులు వైభవ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పూల సింగిడి.. ఊరంతా సందడి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు జిల్లాలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒక్కచోట చేర్చి ఆడి పాడారు. అనంతరం స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది. – అనంతగిరి



తరులుతున్నా.. చర్యలు సున్నా

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా



యాలాల పరిధిలోని వాగు నుంచి ఇసుక తరలింపు

- తాండూరులో అధికం
- పరిగిలో ఫిల్టర్ ఇసుక తయారీ
- ఇందిరమ్మ ఇళ్ల పేరిట దోపిడీ
- ప్రజావాణికి ఫిర్యాదులు
- పట్టించుకోకపోవడంతో గ్రామస్తులే అడ్డుకుంటున్న వైనం

వికారాబాద్: అక్రమార్కులు ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ మాఫియాకు అడ్డుకట్ట వేయాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖలను మేనేజ్ చేస్తూ ఇసుకాసురులు కాసులు గడిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో అందిన ఫిర్యాదులు, ఇంటెలిజెన్స్ నివేదికల నేపథ్యంలో ఉన్నతాధికారులు ఏక కాలంలో ఐదుగురు పోలీస్ అధికారులపై వేటు వేసిన విషయం విదితమే. దీంతో కొంతకాలం పాటు పోలీసులు కఠినంగా వ్యవహరించగా ఇటీవల వారి వైఖరిపై విమర్శలతో పాటు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ప్రజావాణికి ఫిర్యాదులు అందాయి. వాటిపై అధికారులు స్పందించకపోవడంతో ఇటీవల యాలాల మండలంలో స్థానికులే అక్రమార్కులను అడ్డుకుని ఆందోళన చేపట్టారు.

సిండికేట్‌గా విక్రయాలు

ప్రస్తుతం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితంగా ఇస్తుంది. ఇళ్లు మంజూరైన ప్రొసీడింగ్ పత్రం చూపితే ఆ ఇంటికి అవసరమైన ఇసుక ఉచితంగా కేటాయిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులకు సైతం పర్మిట్లు ఇస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకకు రూ.600 చొప్పున కలెక్టర్ పేరున డీడీ తీస్తే ప్రభుత్వ పనులకు ఇసుక కేటాయిస్తున్నారు. కాగా ఇందిరమ్మ ఇళ్ల పేరున కేటాయించిన పర్మిట్లు, ప్రభుత్వ పనుల పర్మిట్ల చాటున రెండు మూడు పర్యాయాలు ఇసుక తరలించి మాఫియా సొమ్ము చేసుకుంటోంది. ఇదే ఇసుక టన్నుకు రూ.2 వేల నుంచి 2,500 వరకు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పరిగి ప్రాంతంలో కొందరు ఫిల్టర్ ఇసుక సైతం తయారు చేసి విక్రయిస్తున్నారు.

అధికారుల సహకారం

జిల్లాలో ఇసుక లభ్యత తాండూరు డివిజన్‌లో ఎక్కువగా ఉండగా ఎస్‌ఐలు మొదలుకుని అక్కడ విధులు నిర్వహించే సీఐలు, డీఎస్పీల వరకు అక్రమ రవాణాకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఆ డివిజన్‌లో ఓ ఎస్‌ఐ అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా.. ఇసుక మాఫియా పనే అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. తాండూరు డివిజన్‌లో గతంలో ఇద్దరు సీఐలపై అక్రమార్కులకు సహకరించారనే కారణంతో వేటు పడింది. ఇదే సమయంలో ఇద్దరు ఎస్‌ఐలపై సైతం వేటు వేశారు. తాండూరు సబ్ డివిజన్ పరిధిలో నాలుగు రూరల్ ఠాణాలు, ఓ పట్టణ పోలీస్ స్టేషన్ ఉండగా ఇందులో ఇద్దరు ఎస్‌ఐలు, ఇద్దరు సీఐలపై ఒకేసారి చర్యలు తీసుకున్నారు. ఇందుకు మైనింగ్, రెవెన్యూ అధికారులు సైతం సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పొలిటికల్ సపోర్టుతోనే...

తాండూరు సబ్ డివిజన్‌లో పోస్టింగుల కోసం పెద్ద మొత్తంలో ముట్టజెప్పి వస్తున్నట్టు సమాచారం. రాజకీయ అండదండలతో పోస్టింగులు తెచ్చుకుంటున్న పోలీసు అధికారులు విధుల్లో చేరగానే నేతల అండదండలతో రెచ్చిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పెద్ద మొత్తంలో నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ఇందులో రాజకీయ నేతల హస్తం సైతం ఉన్నట్టు తెలుస్తోంది. గతంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన ఓ నాయకుడు ఇసుక అక్రమ రవాణాలో కీలకంగా వ్యవహరించగా.. ప్రస్తుత అధికార పార్టీ నేతలు కొందరు ఇసుక దందా విషయంలో కీలకంగా వ్యవహరిస్తూ అక్రమంగా ఆర్జిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు అక్రమార్కుల విషయంలో చర్యలు తీసుకుని సామాన్యుడికి ఇసుక ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

అనంతగిరి: పట్టణంలోని ఆలంపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో వెలిసిన వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాల(శ్రీవారి రజతోత్సవ బ్రహ్మోత్సవాలు)కు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ధర్మకర్తల మండలి ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు ధ్వజారోహనంతో ప్రారంభం కానున్నాయి. నిత్యం ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు మహాభిషేకం, 7 గంటలకు నైవేద్యం, మంగళహారతి, 8గంటలకు అర్చనలు, స్వామి వారి దర్శనం, 10 గంటలకు శ్రీవారి కల్యాణం, మధ్యాహ్నం 12.30 గంటలకు నైవేద్యం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, ఒంటిగంటలకు మహాప్రసాదం, సాయంత్రం 4గంటలకు విష్ణు లలితా సహస్రనామ పారాయణం, 5గంటలకు మహిళల భజన, 6 గంటలకు వాహనసేవలు,



6.30 గంటలకు ఊయల సేవ అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. గురువారం శమీ పూజ, చక్రస్నానం, ధ్వజ అవరోహనంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు లక్ష్మీనారాయణ కోరారు.

పట్టపగలే దారుణం

- మేనత్తపై కత్తితో దాడిచేసిన అల్లుడు
- పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు

తాండూరు టౌన్: మానవ సంబంధాలు మంటగలుస్తున్నాయి. అయిన వారే ఒకరిని ఒకరు చంపుకునే ఘటనలు ఇటీవల పెరిగిపోతున్నాయి. పంది మాంసం విక్రయం విషయంలో తలెత్తిన గొడవ చివరకు ఓ మహిళ ప్రాణాలను బలితీసుకుంది. ఈ ఘటన తాండూరు పట్టణంలోని మల్లప్ప మడిగె వద్ద చోటు చేసుకుంది. పట్టణ సీఐ సంతోశ్ కుమార్ తెలిపిన ప్రకారం.. ఇందిరానగర్‌కు చెందిన పిచ్చకుంట్ల పద్మమ్మ(60) స్థానిక మల్లప్ప మడిగ వద్ద పంది మాంసం విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. ఆమె మేనల్లుడు వెంకటి తాను సైతం ఇక్కడే మరో దుకాణం పెడతానని అత్తకు చెప్పాడు. దీంతో ఆమె నా వ్యాపారం దెబ్బతీయొద్దని అల్లుడును కోరింది. ఇదే విషయంలో ఇరువురి మధ్య పలుమార్లు గొడవలు తలెత్తాయి. అత్త తన వ్యాపారానికి అడ్డుగా ఉందని భావించిన వెంకటి.. ఆదివారం మధ్యాహ్నం మాంసం విక్రయిస్తున్న పద్మమ్మ వద్దకు వచ్చి ఒక్కసారిగా ఆమె తలపై కత్తితో దాడి చేసి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. దాడిని చూసి బెంబేలెత్తిన జనం అనంతరం తేరుకుని రక్తమడుగులో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం నిందితుడు వెంకటి పట్టణ ఠాణాకు వెళ్లి లొంగిపోయాడు. మృతురాలికి భర్త, ఇద్దరు కొడుకులు, ఓ కూతురు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి మెడలో రెండు తులాల బంగారు గొలుసు ఉండాలని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ బంగారం ఎవరు తీసుకుని ఉంటారనేది విచారిస్తున్నామన్నారు.



పద్మమ్మ (ఫైల్)

అమావాస్య రోజు శవం రావొద్దంటూ..

- అడ్డుకున్న స్థానికులు
- మరోచోట అంత్యక్రియలు

కొత్తూరు: అమావాస్య రోజు తమ తండాలోకి శవం రావొద్దంటూ అడ్డుకున్న సంఘటన మండలంలోని మల్లాపూర్‌తండాలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తండాకు చెందిన కిషన్‌నాయక్, విజయలక్ష్మి(35) భార్యాభర్తలు. వీరు కొన్నేళ్లుగా శంషాబాద్‌లో నివాసం ఉంటున్నారు. కిషన్‌నాయక్ క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబంతో కలిసి ఉంటున్నారు. మూడు రోజుల క్రితం కుటుంబ కలహాల నేపథ్యంతో విజయలక్ష్మి పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించగా ఆదివారం ఉదయం ఆమె మృతి చెందింది. దీంతో మృతదేహాన్ని వారి స్వస్థలం మల్లాపూర్‌తండాకు తీసుకువస్తుండగా అమవాస్య కావడంతో కొందరు తండావాసులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఘర్షణ చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నం చేశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు శంషాబాద్ మండలం రామానుజపూర్ గ్రామంలో ఉన్న వారి పొలంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయమై సీఐ నర్సింహారావును వివరణ కోరగా.. బాధిత కుటుంబ సభ్యుల ఇష్టంతోనే రామానుజాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు. అంత్యక్రియలు అడ్డుకున్నారని ఫిర్యాదు ఇస్తే విచారణ జరుపుతామని పేర్కొన్నారు.

స్వచ్ఛత విరియాలి.. వాడలు మెరవాలి

- పల్లెలు, పట్టణాల్లో కొనసాగుతున్న 'స్వచ్ఛతాహీ సేవ'
- అక్టోబర్ 2 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు
- పరిశుభ్రత, దోమల నివారణ, స్వచ్ఛతపై అవగాహన



కేశంపేట మండలం కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛతాహీ సేవ

షాద్‌నగర్: పల్లెలు, పట్టణాలు సంపూర్ణ స్వచ్ఛత సాధించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. పరిశుభ్రతలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ వివిధ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ‘ఒక్క అడుగు స్వచ్ఛత వైపు’ నినాదంతో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. పక్షం రోజుల పాటు రోజుకో కార్యక్రమం నిర్వహించేలా కార్యాచరణ ప్రకటించింది. ఈ నెల 17 నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు అక్టోబర్ 2 వరకు కొనసాగనున్నాయి

కార్యక్రమాలు ఇలా..

- ఈనెల 22న గ్రామాల్లో నీటి క్లోరినేషన్, తాగు నీటి ట్యాంకుల శుభ్రత, పారిశుద్ధ్యంపై ఇంటింటి ప్రచారం
- 23న ఉత్సవ కమిటీల సహకారంతో సాంస్కృతిక కార్యక్రమాలు
- 24న డ్రైనేజీల్లో చెత్త తొలగింపు, ఇంకుడు గుంతల నిర్మాణం
- 25న శ్రమదానం, చెత్త తొలగించిన చోట మొక్కలు నాటడం
- 26న డ్రైడే, మహిళా సంఘాల సభ్యులు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తపై అవగాహన, గ్రామాల్లో దోమల నివారణ చర్యలు, ఫాగింగ్, బ్లీచింగ్ చేయడం
- 27న పారిశుద్ధ్య సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు, మందుల పంపిణీ, బీమా పత్రాల పంపిణీ, ఉత్తమ సిబ్బందికి సన్మానాలు
- 29న ప్లాస్టిక్ వాడకంపై అవగాహన, ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం, మహిళా ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు
- 30న గ్రామాల్లో విస్తృతంగా శ్రమదాన కార్యక్రమాలు
- అక్టోబర్ 1న పనికి రాని పాత వస్తువులతో అలంకరణ వస్తువుల తయారీ, వీధుల్లో శుభ్రమైన ఆరోగ్యకరమైన ఆహార పదార్థాల తయారీపై అవగాహన, మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్
- 2న ప్రభాత భేరి, గ్రామ సభల నిర్వహణ, ఉత్తమ పారిశుద్ధ్య సిబ్బందికి సన్మానాలు.

అవగాహన కల్పిస్తున్నాం

స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి. పరిశుభ్రత, ప్రజారోగ్యంపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి.
– సునీత, మున్సిపల్ కమిషనర్, షాద్‌నగర్

‘స్థానిక’.. కదలిక!

నేడో, రేపో రిజర్వేషన్ల అంశం కొలిక్కి వస్తుందనే అంచనాలు

- ఈ నెలాఖరులో ఎప్పుడైనా నోటిఫికేషన్ వచ్చే అవకాశం
- ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం
- ఇన్నాళ్లు స్తబ్ధుగా ఉన్న నేతల్లో ఒక్కసారిగా కదలిక
- గ్రామ, మండలాల వారీగా సమావేశాల నిర్వహణకు పార్టీల యోచన



వికారాబాద్: దసరాకు ముందే స్థానిక సందడి మొదలు కానుంది. ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాల్సిందిగా ఇప్పటికే ప్రభుత్వం నుంచి జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు అందడం, ఆ మేరకు వార్డు, గ్రామ, మండల స్థాయి ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్లు, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను రెడీ చేసి ఉంచడం తెలిసిందే. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పనకు సంబంధించిన జీఓ వెలువడిన వెంటనే డెడికేషన్ కమిటీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా వార్డులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. ఒకటిరెండు రోజుల్లో బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చే అవకాశం ఉండటం, నెలాఖరులోగా ఎప్పుడైనా నోటిఫికేషన్ వెలువడే చాన్స్ ఉండటంతో ఇప్పటి వరకు స్తబ్ధుగా ఉన్న ఆశావహుల్లో మళ్లీ చర్చ మొదలైంది. తొలి విడతలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, తర్వాత వార్డు మెంబర్లు, సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.

ఇప్పటికే ఓటర్ల ముసాయిదా వెల్లడి

జిల్లాలో 20 మండలాలు ఉండగా, వీటి పరిధిలో నాలుగు మున్సిపాలిటీలున్నాయి. 20 జెడ్పీటీసీ స్థానాలతో పాటు 227 ఎంపీటీసీ స్థానాలు ఖరారయ్యాయి. వార్డులు, గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల పరిధిలో ఓటర్ల జాబితాలను పంచాయతీ/ మండల పరిషత్ కార్యాలయాల్లో వెల్లడించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పార్టీపరంగా ప్రకటించనున్నట్లు తెలిసింది. వీకెండ్‌లో కానీ/దసరా సెలవుల్లో కానీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది.

జిల్లాలో స్థానిక స్వరూపం	
గ్రామ పంచాయతీలు	594
వార్డులు	5,058
మొత్తం ఓటర్లు	6,99,895
పురుషులు	3,44,963
మహిళలు	3,54,912
ఇతర ఓటర్లు	19
ఎంపీటీసీలు	227
జెడ్పీటీసీలు	20

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే ఏర్పాట్లు కూడా చేశాం. ఓటర్ల జాబితా తయారీలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారమివ్వబోం. బోగస్ ఓట్లకు తావు లేకుండా పక్కాగా రూపొందిస్తున్నాం. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి.. అభ్యంతరాలను స్వీకరించి, అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నాం. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేస్తాం. నోటిఫికేషన్ జారీ చేసి, నామినేషన్ల స్వీకరణ తర్వాతే బ్యాలెట్ పేపర్లపై అభ్యర్థుల పేర్లు, పార్టీ గుర్తులను ముద్రించనున్నాం. ఇందుకోసం అవసరమైన బ్యాలెట్ పేపర్లను సిద్ధంగా ఉంచాం. బ్యాలెట్ బాక్సులను ఇతర రాష్ట్రాల నుంచి సమకూర్చనున్నాం.
– ప్రతీక్‌జైన్, కలెక్టర్

క్లుప్తంగా

నమో యువ రన్



కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు

తాండూరు: పట్టణంలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ఆదివారం నమో యువరన్ కార్యక్రమం నిర్వహించారు. రన్ అనంతరం స్థానిక విలియం మూన్ పాఠశాల మైదానంలో వ్యాయామం చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ భారత దేశాన్ని అగ్రగామిగా నిలిపారన్నారు. దేశానికి ఆరోగ్యకరమైన యువతే వెన్నుముక అన్నారు.

మట్టిగుంతలో పడి పంచాయతీ కార్మికుడి మృతి

తాండూరు రూరల్: మట్టిపనికి వెళ్లిన పంచాయతీ కార్మికుడు గుంతలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఎల్మకన్నె గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రమెట్టి బాలప్ప(38) పంచాయతీ కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బోనమ్మ ఆలయం వద్ద మట్టి తవ్వేందుకు తీసుకెళ్లాడు. మట్టి ట్రాక్టర్‌లో నింపుతుండగా బాలప్ప ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయాడు. వెంటనే ఆయన్ను తాండూరు పట్టణంలోని జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం.

చికిత్స పొందుతున్న అడ్వకేట్ మృతి



బాలయ్య(ఫైల్)

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని కొత్తగడి సమీపంలో శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న అడ్వకేట్ బాలయ్య(58) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. బంట్వారం మండలం బొపునారం గ్రామానికి చెందిన బాలయ్య వికారాబాద్ కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆయనకు భార్య, నలుగురు కూతుర్లు, కొడుకు ఉన్నారు. మృతుడు గతంలో బార్ అసోసియేషన్ కమిటీలో ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. నవ్వుతూ అందరిని పలకరించే బాలయ్య అకాల మరణం తమను కలిచివేస్తోందని న్యాయవాదులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు సందర్శించి నివాళి అర్పించారు. సాయంత్రం వికారాబాద్‌లో అంత్యక్రియలు ముగిశాయి.

ప్రైవేటు ఉద్యోగి బలవన్మరణం



అరవింద్ (ఫైల్)

నవాబుపేట: కుటుంబ కలహాల కారణంగా ఓ ప్రైవేటు ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడ్డా డు. ఎస్ఐ పుండ్లిక్ తెలిపిన ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా చెందుర్తు మండల కేంద్రానికి చెందిన అరవింద్(30) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆరు నెలల క్రితం అదే ప్రాంతానికి చెందిన వినూత్నతో వివాహమైంది. హైదరాబాద్ నివాసం ఉంటున్న ఈ దంపతుల నడుమ తరచూ గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 19న డ్యూటీకి వెళ్తున్నాని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. మండల పరిధిలో ని గేట్ వనంపల్లి శివారులో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గమనించిన పశువుల కాపరులు పోలీసులు సమాచారం ఇచ్చా రు. మృతుడి వద్ద లభించిన ఆధారాలను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు రాజు, లక్ష్మీ వచ్చి తమ కొడుకుగా నిర్ధారించారు. అనంతరం మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వికారాబాద్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సమాధుల తొలగింపు సరికాదు

కొడంగల్: అభివృద్ధి పేరిట దర్గాలను తొలగించడం సరికాదని కొడంగల్ పట్టణ ముస్లింలు ఆదివారం ఆందోళన చేపట్టారు. స్థానిక వినాయక్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న మహబూబ్ సుబాని దర్గా, వినాయక్ చౌరస్తా సమీపంలోని సమాధులను పోలీసులు రాత్రికిరాత్రే తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల విస్తరణ పేరిట చిరువ్యాపారుల డబ్బాలు, పేదల ఇళ్లను తొలగించారని వాపోయారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని.. తాము దైవాలు భావించే దర్గాలను పోలీసు బలగాలతో కూల్చడం సరికాదన్నారు. ధర్నా చేస్తున్న ముస్లింలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ ధర్నాకు మద్దతుగా బహదూర్‌పూర ఎంఐఎం ఎమ్మెల్యే, బోధన్ మాజీ ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు.

సుడి దోమతో జాగ్రత్త

వరి పైరుకు దోమపోటు

- సమగ్ర యాజమాన్యంతో నివారణ



నవాబుపేట: వరి పంటకు పొట్ట దశలో సుడిదోమ ఆశించే అవకాశం ఉంటుంది. ఇవి వరి మొక్కల నుంచి రసాన్ని పీల్చి మొక్కలను పసుపురంగుకు మార్చి ఎండిపోయేలా చేస్తాయి. ఇది రైతులకు ఆందోళన కలిగిస్తుంది. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి జ్యోతి పేర్కొన్నారు.

గుర్తింపు లక్షణాలు

- వరి పంటలో ప్రధానంగా గోధుమ రంగు దోమ(బీపీహెచ్) , తెల్లవీపు దోమ(డబ్ల్యూపీహెచ్)లు ఆశిస్తాయి.
- పిల్ల, పెద్ద దోమలు గుంపులుగా దుబ్బుల మొదళ్ల నుంచి రసం పీలుస్తాయి.
- ఆకులు లేత పసుపు రంగులోకి మారతాయి.
- పొలంలో నీరు తెట్టులా తేలుతూ కనిపిస్తుంది.
- పంట సుడులుగా వలయాకారంలో ఎండిపోతుంది. దీనిని హోవర్ బర్న్ అంటారు.
- తీవ్రత ఎక్కువైతే పొలం ఎండిపోతుంది. తాలు గింజలు ఏర్పాడుతాయి. నూర్పినప్పుడు సూకలు అవుతాయి.
- సుడిదోమ ద్వారా గ్రాసి స్టంట్ వైరస్ వ్యాప్తి చెందుతుంది.

నివారణ :

ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు వాడాల్సిన మందులు

- డైనోటెప్యూరాన్ 20ఎస్‌జీ-0.4 గ్రాములు/బ్యూప్రొఫెజిన్-1.6 మి.లీ/పైమెట్రొజైన్ 50 డబ్ల్యూజీ-0.60గ్రాములు/ట్రిఫ్లూమెజోపైరిమ్-0.485 మి.లీ/ఇమిడాక్లోప్రిడ్ 40శాతం ప్లస్ ఎతిప్రోల్ 40శాతం డబ్ల్యూజీ--0.25గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మందుకు పిచికారీ సమయంలో పొలంలో నీటిని తగ్గించాలి.
- పాయలు తీసి, మందు మొక్కల మొదళ్లపై పడేలా చూడాలి.

భారీ వర్షం

- పొంగిపొర్లిన వాగులు
- నిలిచిన రాకపోకలు



సంగెంకలాన్ వద్ద పారుతున్న వాగు

తాండూరు రూరల్: పెద్దేముల్, తాండూరు మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములతో కూడిన వానతో పంట పొలాల్లో భారీ నీరు చేరింది. పెద్దేముల్ మండలం గాజీపూర్ బ్రిడ్జి వద్ద మట్టి రోడ్డు బురదమయంగా మారింది. సంగెంకలాన్ చు ట్టూ వాగులు పొంగిపొర్లాయి. దీంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఉధ్రుతి తగ్గిన తర్వాత రాకపోకలు సాగించారు.

బండ్లగూడను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



ఎమ్మెల్యేకు వినతిపత్రమిస్తున్న కాలనీ నేతలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా అభివృద్ధి చేసేందుకు నిధులను మంజూరు చేసి అభివృద్ధి పరుస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు హరీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో శివసాయినగర్ కాలనీ వాసులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి చేయాల్సిన పనులను ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సానుకూలంగా స్పందించి వెంటనే కార్పొరేషన్ కమిషనర్‌కు ఫోన్ చేసి జరగవలసిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఎస్టిమేషన్స్ వేసి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్పొరేషన్ అభివృద్ధిలో భాగంగా సంవత్సరంలోనే ఇప్పటికే వంద కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే వివరించారు. బండ్లగూడ కార్పొరేషన్‌ను రాజేంద్రనగర్ నియోజకవర్గంలోనే గొప్ప కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. కాలనీ నేతలు బహుబలి వినయ్, రాజేష్, భరత్, హేమంత్, రాధిక, రేణుక, రజిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశసేవలో భాగస్వామ్యులు కావాలి



అమ్మ ఒడి- నా తెలంగాణ పుస్తకావిష్కరణలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో దత్తాత్రేయ

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- అమ్మ ఒడి – నా తెలంగాణ పుస్తకావిష్కరణ

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో రచయిత్రి రాయపూడి ఆశాలత, ఆమె కుమారుడు రంజీ ట్రోఫీ క్రికెటర్ రాయపూడి నాగేంద్ర ఆధ్వర్యంలో రచించిన 'అమ్మ ఒడి – నా తెలంగాణ' పుస్తకాన్ని ఆదివారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. విద్యార్థులు దేశసేవలో భాగస్వామ్యులు కావాలన్నారు. ప్రపంచ దేశాల్లో డిజిటలైజేషన్ దేశంగా భారతదేశం నిలవడం సంతోషంగా ఉందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో ప్రపంచ దేశాలను దీటుగా భారతదేశం అవతరించిందన్నారు. ఆదివాసీ ప్రాంతాన్ని ఎంచుకొని వారి స్థితిగతులపై పరిశోధనలు చేసి విద్యా, ఆరోగ్య, ఉపాధి కల్పించి పేదరికాన్ని పాలదోలమే లక్ష్యంగా ఐఐటీ విద్యార్థి, రంజీ ట్రోఫీ క్రికెటర్ నాగేంద్ర పని చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హరియాణా మాజీ గవర్నర్ దత్తాత్రేయ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబు, బిట్స్ పిలానీ డైరెక్టర్ సౌమ్యా ముఖర్జీ, డీన్ యేగేశ్వరి పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



దశరథ్ మృతదేహం

శంకర్‌పల్లి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శంకర్‌పల్లి పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్పరెడ్డి గూడేనికి చెందిన కుమ్మరి దశరథ్(38) కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతూ ఉండేవాడు. ఆయనకి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. దశరథ్‌కి అనారోగ్య సమస్యలు రావడంతో డాక్టర్ మద్యం తాగొద్దని సూచించారు. అయినప్పటికీ తాగడం మానకపోవడంతో శనివారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందని దశరథ్ ఇంట్లో గది లోపలికి వెళ్లి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

ఇబ్రహీంపట్నం రూరల్: చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.సామేలు పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలోని పాషానరహరి స్మారక కేంద్రంలో ఆదివారం కేవీపీఎస్, జనవిజ్ఞాన వేదిక, ప్రజానాట్యమండలి సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సామేలు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం కుల, మత తారతమ్యాలు లేకుండా జరిగిందని గుర్తు చేశారు. ఈ నెల 26న చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని త్రిశక్తి కాలనీలో తెలంగాణ సాయుధ పోరాటం వీధి నాటకం రాత్రి 7 గంటలకు ప్రదర్శిస్తారన్నారు. తెలంగాణ సాహితి సంస్థ జిల్లా కన్వీనర్ సత్తన్న, ఆలేటి ఆటం తదితరులు పాల్గొన్నారు.

ఏనుగు జంగారెడ్డికి గ్లోబల్ పీస్ అవార్డు



జంగారెడ్డికి అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

కందుకూరు: అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ సూచన మేరకు సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ జి.వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆదివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డికి గ్లోబల్ పీస్ అవార్డు-2025 ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. జంగారెడ్డి అహింసా మార్గంలో విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో ఉంటూ యువతకు మార్గదర్శంగా నిలిచారని, అందుకే అవార్డుకు ఎంపిక చేశామని తెలిపారు. అవార్డు గ్రహీత మాట్లాడుతూ.. హింసా మార్గం ద్వారా ఏమీ సాధించలేమని అన్నారు. దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, సంస్థ నిర్వాహకులు బిచ్చుకారి సూర్య, ఢిల్లీ శివకుమార్, అందుగుల సత్యనారాయణ, సీనియర్ నాయకులు రాకేష్‌గౌడ్, సొడపు వెంకటేశ్, యు.బాబురావు, మహేందర్, నరసింహా, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు అలవాటుగా మార్చుకోవాలి



విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్
- ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు

శంషాబాద్: క్రీడలు పిల్లల దగ్గరి నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో అలవాటుగా మార్చుకోవాలని రాజేంద్రనగర ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సూచించారు.ఆదివారం పట్టణంలో ఎస్ఎస్ స్కేటింగ్ మైదానంలో మహబూబ్‌నగర్ జిల్లా రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ 2025 పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.... చిన్న వయసుల్లో క్రీడాభిరుచిని పెంచడం ఎంతో మంచిదన్నారు. క్వాడ్, ఇన్‌లైన్ విధానాల్లో నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన వారిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, మాజీ వైస్ చైర్మన్ బండిగోపాల్, మాజీ కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి.సంజయ్‌యాదవ్, సీనియర్ నాయకులు దూడల వెంకటేష్‌గౌడ్, జి.వై.ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆక్టోపస్ సేవలు భేష్

టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

సాక్షి, సిటీబ్యూరో: ఉగ్రవాద కార్యకలాపాల నియంత్రణలో ఆర్గనైజేషన్ ఫర్ కౌంటర్ టెర్రరిస్ట్ ఆపరేషన (ఆక్టోపస్) సేవలు ఎనలేనివని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. దేశంలోనే తెలంగాణ ఆక్టోపస్ విభాగానికి అపారమైన అనుభవముందని ఆయన గుర్తు చేశారు. యూసుఫ్‌గూడలోని టీజీఎస్పీ మొదటి బెటాలియన్‌లో ఆదివారం ఆక్టోపస్ కమాండో పిల్లర్స్ పేరుతో గెట్ టు గెదర్ జరిగింది. గతంలో ఆక్టోపస్‌లో పని చేసిన అధికారులతో కలిసి వీసీ సజ్జనార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పటి జ్ఞాపకాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. 2007లో గోకుల్ చాట్, లుంబినీ పార్క్ పేలుళ్ల తర్వాత అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆక్టోపస్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. అప్పటి శిక్షణ, ఆపరేషన్లు, టీమ్ వర్క్ అన్నీ తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐజీ మురళీకృష్ణ, బెటాలియన్ డీఐజీలు సన్నీ, ప్రసాద్ బాబు, రిటైర్డ్ కమాండెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్కడ చంపి.. ఇక్కడ నక్కి!

- నవీ ముంబైలో భార్యను చంపిన మనోహర్
- ఆరేళ్ల క్రితం చోటుచేసుకున్న దారుణం
- తప్పించుకుని వచ్చి సిటీలో దాక్కున్న నిందితుడు
- గత వారం వచ్చి పట్టుకెళ్లిన ప్రత్యేక బృందం

సాక్షి, సిటీబ్యూరో: చిన్న కారణం నేపథ్యంలో మహారాష్ట్రలోని నవీ ముంబైలో భార్యను చంపి, పరారై వచ్చిన మనోహర్ సరోదే (50) ఆరేళ్ల తర్వాత నగరంలో పట్టుబడ్డాడు. 2019లో ఈ ఘాతుకానికి పాల్పడిన అతగాడు హైదరాబాద్ వచ్చి తలదాచుకున్నాడు. కాటేదాన్ ప్రాంతంలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. సాంకేతిక ఆధారాలను బట్టి మనోహర్ ఆచూకీ కనిపెట్టిన నవీ ముంబై పోలీసులు గత వారం అతడు నివసిస్తున్న గదిపై దాడి చేసి అరెస్టు చేశారు. అక్కడి కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

చికెన్ ముక్కల విషయంలో వివాదం...

నవీ ముంబైలోని కమోథే ప్రాంతానికి చెందిన మనోహర్‌కు నాందేడ్‌కు చెందిన పల్లవితో 2007లో వివాహమైంది. పల్లవి గృహిణి కాగా... మనోహర్ స్థానికంగా ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసే వాడు. మద్యానికి బానిసైన ఇతగాడు నిత్యం భార్యతో గొడవ పడేవాడు. ఓ దశలో మానసికంగానూ దెబ్బతిన్న వ్యక్తిలా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. 2019 డిసెంబరు 4న రాత్రి మనోహర్ తన విధులు ముగించుకుని, ఇంటికి వెళ్తూ చికెన్ తీసుకువెళ్లాడు. మార్గమధ్యంలోనే పూటుగా మద్యం సేవించిన అతగాడు ఇంటికి వెళ్లిన తర్వాత చికెన్‌ను భార్యకు అప్పగించి వండమని చెప్పాడు. అప్పటికే ఇద్దరు పిల్లల ఆలనాపాలనా చూస్తున్న ఆమె వంట చేయడం కాస్త ఆలస్యమైంది.

విచక్షణ కోల్పోయి కిరోసిన్ పోసి...

దీంతో దాదాపు గంట పాటు ఆమెతో వాగ్వాదం చేస్తూనే ఉన్నాడు. వంట పూర్తయిన తర్వాత భార్యకు భోజనం వడ్డించిన పల్లవి తన పిల్లల వద్దకు వెళ్లింది. తనకు వడ్డించిన కూరలో చికెన్ ముక్కలు తక్కువ ఉన్నాయని, పిల్లలతో కలిసి తినడానికి దాచుకున్నావా? అంటూ మనోహర్ భార్యను దూషించడం మొదలుపెట్టాడు. ఆమె వారించడానికి ప్రయత్నించడంతో మరింత రెచ్చిపోయిన అతగాడు తీవ్రంగా దాడి చేశాడు. స్పృహ తప్పి పడిపోయిన పల్లవిపై ఇంట్లో ఉన్న కిరోసిన్ పోసిన మనోహర్ నిప్పంటించి పారిపోయాడు. ఈ ఘోరాన్ని చూసిన వారి సంతానం నిశ్చేష్టులై ఉండిపోయారు. పల్లవి ఆర్తనాదాలు విన్న చుట్టపక్కల వాళ్లు ఆమెను ముంబైలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దాదాపు 45 శాతం కాలిన గాయాలైన ఆమె మూడు రోజుల చికిత్స తర్వాత చనిపోయింది.

కాటేదాన్ వచ్చి కూలీగా మారి...

దీంతో మనోహర్‌పై నమోదైన హత్యాయత్నం కేసును కమోథే పోలీసుస్టేషన్ అధికారులు హత్యగా మార్చారు. నవీ ముంబై నుంచి పరారైన మనోహర్ రెండేళ్ల పాటు వివిధ ప్రాంతాల్లో సంచరించాడు. 2021లో నగరానికి వచ్చిన ఇతగాడు కాటేదాన్ ప్రాంతంలో ఓ గది అద్దెకు తీసుకున్నాడు. బతుకుతెరువు కోసం ఓ కంపెనీలో దినసరి కూలీగా చేరాడు. నవీ ముంబైతో పాటు తన కుటుంబీకులు, బంధువులతో సంబంధాలు తెంచుకున్నాడు. దీంతో ఇతడి ఆచూకీ కనిపెట్టడం కమోథే పోలీసులకు సవాల్‌గా మారింది. ఇటీవల మనోహర్ నవీ ముంబైలో ఉన్న తన స్నేహితుడిని సంప్రదించాడు. సాంకేతిక ఆధారాలను బట్టి ఈ విషయం గుర్తించిన కమోథే అధికారులు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. సిటీకి వచ్చిన ఆ టీమ్ మనోహర్‌ను అరెస్టు చేసి తీసుకువెళ్లింది.

పూలతోట.. సిరుల పంట

పండుగల వేళ.. పూలకు క్రేజీ ఏర్పడింది. రోజువారీగా ఎలాంటి కార్యాలు చేపట్టినా.. పుష్పాలకు తగిన ప్రాధాన్యం ఉంటుంది. కానీ.. వెనువెంటనే వస్తున్న బతుకమ్మ సంబురాలు, దేవీ నవరాత్రోత్సవాలు, అనంతరం దీపావళి పండుగల నేపథ్యంలో డిమాండ్ బాగా పెరిగింది. వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పూతోటల రైతులకు లాభాల పంట పండిస్తున్నాయి.

పండుగల వేళ.. భళే డిమాండ్

- హైవేలపై విక్రయిస్తున్న రైతులు
- కిలో బంతికి రూ.50, చామంతికి రూ.150
- తాజా పూలను కొనుగోలు చేసేందుకు ప్రజల ఆసక్తి



బంతిపూలు కోస్తున్న కూలీలు

చౌదర్‌పల్లి గేట్ వద్ద సాగర్‌రోడ్డుపై బంతిపూలను విక్రయిస్తున్న మహిళలు

యాచారం: హైదరాబాద్ మహానగరం చుట్టూ విస్తరించి ఉన్న జిల్లా పరిధి వ్యవసాయ పొలాలు పూతోటలకు ప్రసిద్ధి. ఇబ్రహీంపట్నం, శంషాబాద్, రాజేంద్రనగర్, చేవేళ్ల, కందుకూరు, షాద్‌నగర్, మహేశ్వరం, హయత్‌నగర్‌లో పూల సాగుకు అనుకూలమైన నేలలు ఉండడంతో.. ఆయా ప్రాంతాల రైతులు పూ తోటల పెంపకంపై దృష్టి సారించారు. సీజన్లను బట్టి సుమారు రెండు వేల ఎకరాలకు పైగానే బంతి, చామంతి, కనకాంబరాలు, మల్లె, గులాబీని సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడి, అంతే శ్రమతో స్వల్పకాలంలోనే అధిక లాభాలు పొందుతున్నారు. ఒక రకంగా పూతోటలు.. వారి ఇంట్లో సిరులు కురిపిస్తున్నాయి.

పూల సాగుకు ఆసక్తి

రాజధానికి చేరుకునే శ్రీశైలం, నాగార్జునసాగర్, కర్నూల్, బీజాపూర్, విజయవాడ జాతీయ రహదారులకు ఇరువైపులా సాగు భూములున్న రైతులు.. పూతోటల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. కాలానికి అనుగుణంగా పంట పండిస్తూ.. హైవేపైనే విక్రయిస్తుంటారు. తాజా పూలు కావడంతో ప్రజలు కొనుగోలు చేయడానికి మక్కువ చూపుతున్నారు. పొలాల వద్దకే వచ్చిన కొనుగులు చేస్తుండటంతో ఇది రైతులకు బాగా కలిసి వస్తోంది. బంతి కిలోకు రూ.50 నుంచి వంద లోపు డిమాండ్ ఉండగా, అదే చామంతి, కనకాంబరాలు, మల్లె, గులాబీ తదితర వాటికి కిలో రూ.150 పైగానే ఉంటుంది.

డిమాండ్‌ను బట్టి..

డిమాండ్‌ను బట్టి రైతులు పూల సాగును చేస్తున్నారు. బోనాలు, వినాయక చవితికి మంచి లాభాలు పొందారు. బతుకమ్మ, దసరా, దీపావళి, కొద్ది రోజుల్లో వచ్చే కార్తీక మాసంలో 41 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో జరిగే అయ్యప్ప పూజలను దృష్టిలో ఉంచుకొని సాగు చేస్తూ.. ఆదాయం పొందేందుకు ప్రణాళిక చేసుకున్నారు. కొందరు రైతులు స్థానికంగానే విక్రయిస్తుండగా.. మరికొందరు నగరానికి తరలిస్తున్నారు.

ఏడు ఎకరాల్లో బంతి



రూ.లక్షన్నర పెట్టుబడితో ఏడు ఎకరాల్లో బంతిని సాగు చేస్తున్నాను. దసరా పండుగ సందర్భంగా.. పూలను కోసం హైవేపై విక్రయిస్తున్నాం. రానున్న దీపావళి, కార్తీకమాసంలో మంచి లాభాలు వస్తాయనే నమ్మకం ఉంది.

– కృష్ణ, పూల వ్యాపారి, చౌదర్‌పల్లి


పూలతోనే పూజ



కార్తీక మాసం అయ్యప్ప దీక్షలో 41 రోజుల పాటు పూలతో మణికంఠుడికి ప్రత్యేక పూజలు చేస్తాం. అందులో ఎక్కువగా బంతిపూలే ఉంటాయి. ఇతర పుష్పాలతో దేవతామూర్తులకు అలంకరణ చేస్తాం. ధర ఎంతున్నా.. భక్తితో కొనుగోలు చేస్తాం. కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– నారాయణశెట్టి, యాచారం

ఆకట్టుకుంటున్న బంతి



కలర్ బంతి పూలు

సీజన్ ఏదైనా బంతికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది. ఆకర్షణీయంగా ఉండటమే కాకుండా.. ధర తక్కువగా ఉండడంతో వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతుంటారు. ప్రస్తుత సీజన్‌లో యాచారం, కందుకూరు, మంచాల, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కడ్తాల్, తలకొండపల్లి తదితర మండలాల్లోని అనేక గ్రామాల్లో రైతులు బంతిని సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో సిరులు పండించుకుంటున్నారు.